# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. దేశ పురోభివృద్ధిలో తమ పరిశోధనలు, ఆవిష్కరణలతో ఐఐటీలు కీలక భూమిక పోషిస్తున్నాయని ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు.**

**2. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సహాయక చర్యలలో రోబోలను వినియోగించే అంశాన్ని పరిశీలించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

**3. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ స్థానాలకు ఈరోజు ఓట్ల లెక్కింపు జరుగుతుంది.**

**4. ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభమవుతాయి.**

**5. ఛాంపియన్స్ ట్రోఫీలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 44 పరుగుల తేడాతో గెలుపొందింది.**

==========================

దేశ పురోభివృద్ధిలో తమ పరిశోధనలు, ఆవిష్కరణలతో ఐఐటీలు కీలక భూమిక పోషిస్తున్నాయని ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. ఒకరోజు తెలంగాణ పర్యటనకు వచ్చిన ఉపరాష్ట్రపతి... సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌ను సందర్శించారు. అక్కడ విద్యార్థులు, ఐఐటీ హైదరాబాద్ ఫ్యాకల్టీ, సిబ్బందితో ముచ్చటించారు. నాణ్యమైన విద్యతోనే ప్రపంచంతో పోటీ పడగలుగుతున్నామని.. విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా పేర్కొంటూ...

వాయిస్ .. 31 సెకన్లు

--------------------------

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ –ఎస్ఎల్‌బిసి సహాయక చర్యలలో రోబోలను వినియోగించే అంశాన్ని పరిశీలించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారుల ఆదేశించారు. సొరంగంలో సహాయక చర్యలు జరుగుతున్న ప్రాంతాన్ని ముఖ్యమంత్రి గత రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌బిసి వద్ద జరుగుతున్న సహాయక చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,...

వాయిస్... 29 సెకన్లు

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈరోజు ఎమ్మెల్సీ స్థానాలకు ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని రెండు పట్టభద్రుల, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు గుంటూరు- కృష్ణా, ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు, విశాఖ-విజయనగరం, శ్రీకాకుళం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి కౌంటింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారు.

ఇది ఇలా ఉండగా .... తెలంగాణలోని ఎమ్మెల్సీ స్థానాలుకూ ఈరోజు కౌంటింగ్ జరగనుంది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు, ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయుల స్థానానికి కౌంటింగ్ జరుగుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లోని విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనాన్ని అందించనున్నట్లు ఆ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో వసతి గృహాల విద్యార్థులతో ఆయన నిన్న ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపాలెంలోని తన నివాసం నుంచి దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు. ప్రతి వసతిగృహంలో తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని, విద్యార్థులకు సకాలంలో ట్రంకుపెట్టెలు, దుప్పట్లు, తువాళ్లు అందిస్తామని పేర్కొన్నారు. 'ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, వసతి గృహాల భవనాల మరమ్మతులకు 143 కోట్లరూపాయలు కేటాయించిందని మంత్రి వెల్లడించారు.

---------------------------

యువతకు స్వయం ఉపాధి కల్పన కోసం 6 వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చుచేస్తున్నట్లు తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. వనపర్తి జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కలిసి వివిధ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభంమౌతున్నాయి. పరీక్షల్లో భాగంగా ఈరోజు సెకండ్ లాంగ్వేజ్ పేపర్ – 2 పరీక్ష జరుగుతుంది. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించడంలేదని అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ పరీక్షలకు అరగంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు.

కాగా తెలంగాణాలో ఈనెల 5వ తేదీ నుంచి పారంభంకానున్న ఇంటర్మీడియట్ పరీక్షల హాల్ టికెట్లలను విద్యార్థులు కూడా డౌన్ లోడ్ చేసుకునే విధంగా వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచామని అధికారులు తెలిపారు.

---------------------------

తెలంగాణలోనూ విమానాశ్రయాలను అభివృద్ధి చేయనున్నామని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి

కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. హైదరాబాద్ కవాడిగూడలో కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డితో కలిసి నిన్న ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. వరంగల్‌లో మామునూరు విమానాశ్రయ ఏర్పాటు ఇక్కడి ప్రజల చిరకాల ఆకాంక్ష అని అన్నారు. భూ కేటాయింపులు జరగడంతో ఎనిమిది నెలల్లోనే అనుమతులు ఇచ్చామని చెప్పారు. భూసేకరణ పూర్తయిన రెండున్నరేళ్లలో విమానాశ్రయ నిర్మాణం పూర్తి చేస్తామని రామ్మోహన్ నాయుడు తెలియజేస్తూ,

వాయిస్ .. 32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పాడిరైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రాయచోటిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల గోడ పత్రికను మంత్రి నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30వ తేదీ వరకు పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందని.. పాడి రైతులందరూ పశువులకు ఎటువంటి వ్యాధులు సోకకుండా వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..34 సెకన్లు

---------------------------

ఈరోజు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అంతరించిపోతున్న వన్యప్రాణులను సంరక్షించే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి ప్రతియేటా మార్చి 3వ తేదీన ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. మానవ జాతి మనుగడకు అంతరించి పోతున్న ఎన్నోరకాల వన్యప్రాణులను, వృక్షాలను పరిరక్షించుకోవాలని అవగాహన కల్పిస్తూ ఈరోజు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్-ఏలో భాగంగా దుబాయ్ వేదికగా భారత్ - న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో 44 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది. గత రాత్రి జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. అనంతరం 250 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ జట్టు 45.3 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కాగా రేపు జరిగే సెమీఫైనల్లో భారత్ జట్టు ఆస్ట్రేలియాతో పోటీ పడనుంది.

=====================